సాక్షి నల్లగొండ

బుధవారం। 31 । జనవరి । 2024



15మందికి జీవిత ఖైదు

వ్యక్తి హత్య కేసులో 15మందికి జీవిత ఖైదు విధిస్తూ భువనగిరి జిల్లా కోర్టు తీర్పు ఇచ్చింది.

- 8లో



ట్రాన్స్‌ఫార్మర్ దొంగల అరెస్ట్

ట్రాన్స్‌ఫార్మర్లలోని కాపర వైరును చోరీ చేస్తున్న ముఠాను మిర్యాలగూడ పోలీసులు మంగళవారం అరెస్ట్ చేశారు.

- 8లో



వీగిన అవిశ్వాసం

నేరేడుచర్ల మండలంలోని చిల్లేపల్లి పీఏసీఎస్ చైర్మన్‌పై పెట్టిన అవిశ్వాసం వీగిపోయింది.

- 8లో

న్యూస్‌రీల్

స్టాఫ్ నర్సులకు నేడు అపాయింట్‌మెంట్ ఆర్డర్లు

నల్లగొండ టౌన్ : రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల నిర్వహించిన స్టాఫ్ నర్సు సెలక్షన్స్‌లో భాగంగా ఉద్యోగాలకు ఎంపికైనవారికి బుధవారం హైదరాబాద్‌లోని ఎల్‌బీ స్టేడియంలో సీఎం రేవంత్‌రెడ్డి అపాయింట్‌మెంట్ ఆర్డర్లు అందించనున్నారు. ఎంపికైన అభ్యర్థులకు ఇప్పటికే జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులు కౌన్సిలింగ్ నిర్వహించి గుర్తింపు కార్డులు అందజేశారు. వీరందరినీ ఆరు బస్సుల్లో ఎల్‌బీ స్టేడియం వద్దకు తరలించేందుకు వైద్య ఆరోగ్యశాఖ ఏర్పాట్లు చేసింది. అభ్యర్థుల పర్యవేక్షణకు 10 మంది ప్రత్యేక అధికారులను నియమించినట్లు డీఎంహెచ్‌ఓ కొండల్‌రావు తెలిపారు. బస్సులు బుధవారం ఉదయం 8 గంటలకు డీఎంహెచ్‌ఓ కార్యాలయం నుంచి బయల్దేరనున్నట్లు తెలిపారు.

ఫిబ్రవరి 1న ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్

నల్లగొండ : ఇజ్రాయెల్‌లో ఉపాధి, ఉద్యోగావకాశాలకు ఫిబ్రవరి 1న ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్ నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి కల్పన అధికారి ఎస్.పద్మ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణ ప్రభుత్వ కార్మిక ఉపాధి శిక్షణ కర్మాగారాల శాఖ నుంచి గుర్తింపు పొందిన తెలంగాణ ఓవర్సీస్ మ్యాన్‌పవర్ కంపెనీ ఆధ్వర్యంలో ఫిబ్రవరి 1న నల్లగొండలోని ఉపాధి కల్పన కార్యాలయంలో ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు ఆమె తెలిపారు. నిర్మాణం, షట్టర్ కార్పెంటింగ్, సిరామిక్ టైలింగ్, ప్లాస్టరింగ్, ఐరన్ బెండింగ్ పనుల్లో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు ఉంటాయని పేర్కొన్నారు. దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు కనీసం ఎస్‌ఎస్‌సీ ఉత్తీర్ణతతో 3 సంవత్సరాల అనుభవం కలిగి 21 నుంచి 45 సంవత్సరాల మధ్య వయసు కలిగి ఉండాలని పేర్కొన్నారు. ఇతర వివరాలకు www.tomcom.telangana.gov.in వెబ్‌సైట్‌ను లేదా 9985483931 ఫోన్ నంబర్‌ను సంప్రదించాలని ఆమె సూచించారు.

ప్రజల మధ్య చిచ్చుపెట్టే విధంగా కుట్రలు



రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న సామాజిక వేత్త డాక్టర్ రాజు

మిర్యాలగూడ అర్బన్ : ప్రజల మధ్య మత విద్వేషాలతో చిచ్చుపెట్టే విధంగా కేంద్ర పాలకులు కుట్రలు చేస్తున్నారని సామాజికవేత్త డాక్టర్ జే.రాజు అన్నారు. మంగళవారం మండలంలోని యాద్గార్‌పల్లిలో ఎంసీపీఐ యూ ఆధ్వర్యంలో 'దేశంలో ముంచుకొస్తున్న మనువాదం ముప్పు– లౌకిక శక్తుల పాత్ర'అనే అంశంపై నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. భారత దేశంలో భిన్న మతాలు, భిన్న కులాలు, విభిన్న సంస్కృతులు ఉన్నాయన్నారు. దళితులు, ముస్లింలు, క్రైస్తవులను హిందూ మతోన్మాద వాదులు అనేక రకాలుగా ఇబ్బందులు పెడుతున్నారని వారికి కేంద్ర ప్రభుత్వం వత్తాసు పలుకుతుందని ఆరోపించారు. కార్యక్రమంలో ఎంసీపీఐ యూ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వస్కుల మట్టయ్య, నాయకులు తలకొప్పుల సైదులు, తాళ్లపల్లి రవి, పరశురాములు, శ్రీను, యాదగిరి, అరుణ్‌కుమార్, భరత్, మోహన్, దేవయ్య, నాగేందర్, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

భావి తరాలకు మార్గదర్శి మహాత్మాగాంధీ

నల్లగొండ రూరల్: భావి తరాలకు మార్గదర్శి మహాత్మా గాంధీ అని మహాత్మా గాంధీ(ఎంజీయూ) వైస్ చాన్స్‌లర్ గోపాల్‌రెడ్డి అన్నారు. మంగళవారం గాంధీ వర్ధంతి సందర్భంగా యూనివర్సిటీలో ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వీసీ గోపాల్‌రెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థులు చరిత్ర పట్ల అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ అల్వాల రవి, ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ అరుణప్రియ, అధ్యాపకులు ఎంవీఎస్ రెడ్డి, జ్యోతి, ప్రశాంతి, పందరయ్య, సైదులు, శేఖర్, స్వప్న తదితరులు పాల్గొన్నారు.



గాంధీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎంజీయూ వీసీ గోపాల్‌రెడ్డి, సిబ్బంది

అంగన్‌వాడీలను సద్వినియోగం చేసుకోవాలి

నకిరేకల్, చిట్యాల : అంగన్‌వాడీ కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని ఐసీడీఎస్ ఆర్‌జేడీ మోతి అన్నారు. మంగళవారం ఆమె నకిరేకల్ మండలం గోరెంకలపల్లి, చిట్యాల మండలం ఏపూరు అంగన్‌వాడీ కేంద్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయా కేంద్రాల్లో రికార్డులు, పిల్లల హాజరు శాతాన్ని పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ శిశు సంక్షేమ శాఖ ద్వారా అందిస్తున్న పథకాలు అర్హులకు అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారిణి కృష్ణవేణి, సీడీపీఓ కవిత, ఏసీడీఓ అనిత, వెంకటమ్మ, సూపర్‌వైజర్లు పారిజాత, ధనలక్ష్మి, హంసమ్మ తదితరులు పాల్గొన్నారు.



చిట్యాల: ఏపూరులో చిన్నారులను పరిశీలిస్తున్న ఆర్‌జేడీ మోతి

నెరవేరని సీఎంఆర్ లక్ష్యం

గడువిచ్చినా పూర్తికాని బియ్యం సేకరణ

- జిల్లాలో 44శాతమే పూర్తయిన ప్రొక్యూర్‌మెంట్
- మిగతా జిల్లాలతో పోల్చితే ప్రథమస్థానం
- నేటితో ముగుస్తున్న గడువు
- మరో రెండు నెలలు గడువు పెంచే ఆలోచనలో ప్రభుత్వం



నల్లగొండలోని రామ్‌లక్ష్మణ్ రైస్ మిల్లులో తనిఖీలు నిర్వహిస్తున్న పౌర సరఫరాల అధికారులు

నల్లగొండ, మిర్యాలగూడ : కస్టమ్ మిల్లింగ్ రైస్ (సీఎంఆర్) సేకరణ లక్ష్యం నెరవేరలేదు. 2022–23 వానాకాలం, యాసంగి సీజన్ల సీఎంఆర్ సేకరణ గడువు బుధవారంతో ముగియనుంది. ఇప్పటి వరకు వానాకాలానికి సంబంధించి దాదాపు పూర్తికాగా.. యాసంగి సీఎంఆర్ 44 శాతమే పూర్తయింది. అయితే రాష్ట్రంలోని మిగతా జిల్లాలతో పోల్చితే మాత్రం సీఎంఆర్ సేకరణలో నల్లగొండ జిల్లా ముందంజలో ఉండగా.. టార్గెట్ చేరుకోవడంలో మాత్రం వెనుకబడింది. మిగతా జిల్లాలో వానాకాలంలో 88 శాతం, యాసంగిలో 27 శాతమే సీఎంఆర్ సేకరణ పూర్తికావడం గమనార్హం.

యాసంగిలో 44 శాతమే..

యాసంగిలో మిల్లులకు అప్పజెప్పిన దొడ్డు రకం ధాన్యాన్నికి సంబంధించిన బియ్యం సేకరణ కోసం ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. అధికారులతో అనేక సార్లు సమీక్షలు జరిపి బియ్యం సేకరణపై దృష్టి పెట్టాలని ప్రభుత్వం ఆదేశించింది. అందులో భాగంగానే జిల్లా అధికారులు గడువులోపు బియ్యం చెల్లింపు చేయాలని మిల్లులకు పలుమార్లు మౌఖిక ఆదేశాలు జారీ చేశారు. ఇప్పటికే రెండు సార్లు గడువు పెంచిన ప్రభుత్వం జనవరి 31 చివరి గడువు విధించింది. అప్పటిలోగా యాసంగి బియ్యం సేకరణ వంద శాతం పూర్తి కావాలని ప్రభుత్వం ఆదేశించగా ఆ మేరకు బియ్యం ప్రొక్యూర్‌మెంట్ పెట్టాలని అధికారులు మిల్లులపై ఒత్తిడి తీసుకొచ్చారు. కలెక్టర్ హరిచందన ఆదేశాల మేరకు అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్, డీఎస్‌ఓ వెంకటేశ్వర్లు, డీఎం నాగేశ్వర్‌రావు కలిసి ఎప్పటికప్పుడు మిల్లర్లతో సమావేశాలు నిర్వహించారు. సీఎంఆర్ పూర్తి చేయాలని ఆదేశాలు జారీ చేశారు. దీంతో మంగళవారం నాటికి జిల్లా వ్యాప్తంగా 44శాతం వరకు మాత్రమే బియ్యం సేకరణ పూర్తయింది. అయితే గడువులోగా బియ్యం సేకరణ పూర్తి కాకపోతే 50 శాతం బియ్యాన్ని టెండర్ల ద్వారా మిల్లర్లకు అమ్మేయాలని ప్రభుత్వం ఆలోచిస్తోంది. దీనికితోడు పూర్తిస్థాయిలో బియ్యం సేకరణకు గాను ప్రభుత్వం మరో రెండు నెలలు గడువు పెంచేందుకు ఆలోచన చేస్తున్నట్లు సమాచారం.

2022-23 వానాకాలం ధాన్యం, సీఎంఆర్ వివరాలు ఇలా.. (మెట్రిక్ టన్నుల్లో)

వివరాలు	ధాన్యం కేటాయింపు	ఇవ్వాల్సిన సీఎంఆర్	ఇచ్చిన సీఎంఆర్	బకాయి
ఎఫ్‌సీఐ రారైస్	2,91,962	1,95,615	1,94,851	764
ఎఫ్‌సీఐ బాయిల్డ్‌రైస్	85,730	58,296	57,971	325
సీఎస్‌సీ రారైస్	66,884	44,812	44,812	0
మొత్తం	4,44,576	2,98,723	2,97,634	1,089

2022-23 యాసంగి ధాన్యం, సీఎంఆర్ వివరాలు ఇలా.. (మెట్రిక్ టన్నుల్లో)

వివరాలు	ధాన్యం కేటాయింపు	ఇవ్వాల్సిన సీఎంఆర్	ఇచ్చిన సీఎంఆర్	బకాయి
ఎఫ్‌సీఐ రారైస్	3,56,435	2,38,811	16,994	2,21,817
ఎఫ్‌సీఐ బాయిల్డ్‌రైస్	3,32,500	2,26,100	1,87,920	38,180
సీఎస్‌సీ రారైస్	2,866	1,920	0	1,920
మొత్తం	6,91,801	4,66,832	2,04,914	2,61,918

సీఎంఆర్ వెంటనే ఇవ్వాలి



జిల్లాలో ఆయా మిల్లులకు కేటాయించిన సీఎంఆర్ బియ్యాన్ని వెంటనే చెల్లించాలి. ప్రభుత్వం విధించిన గడువు మంగళవారంతో ముగుస్తుంది. ఇప్పటి వరకు జిల్లా వ్యాప్తంగా 44శాతం సీఎంఆర్ సేకరణ జరిగింది. మిగిలిన బియ్యం కూడా మిల్లర్లు వెంటనే ఇవ్వాలి. గడువు పెంపు విషయంపై ప్రభుత్వ నిర్ణయానికి అనుగుణంగా నడుచుకుంటాం.

– వెంకటేశ్వర్లు, డీఎస్‌ఓ

సీఎంఆర్ గడువు పెంచాలి



కస్టమ్ మిల్లింగ్ రైస్ చెల్లింపునకు గడువు పెంచాలి. మిర్యాలగూడ పరిసర ప్రాంతాల్లో 70 రైస్ మిల్లులకు యాసంగి సీజన్ ధాన్యం సీఎంఆర్‌కు ఇవ్వగా 1.35లక్షల మెట్రిక్ టన్నుల బియ్యం ఇవ్వాల్సి ఉంది. ఇప్పటికే 80 వేల మెట్రిక్ టన్నులు చెల్లించాం. ఇంకా మిగిలిన బియ్యం కొంత గడువు ఇవ్వాలి. గత వానాకాలంలో సీఎంఆర్ చెల్లింపు వందశాతం పూర్తి చేశాం. మిల్లుల వద్ద ఉన్న సీఎంఆర్‌కు ప్రభుత్వం టెండర్లు వేస్తే కొనేందుకు కూడా సిద్ధంగా ఉన్నాం.

– గౌరు శ్రీనివాస్, రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు, మిర్యాలగూడ

ఉద్యోగులు బాధ్యతతో పనిచేయాలి





మాట్లాడుతున్న ఇన్‌చార్జి చైర్మన్ అబ్బగోని రమేష్‌గౌడ్, పాల్గొన్న పాలకవర్గ సభ్యులు

- నీలగిరి మున్సిపల్ సమావేశంలో కౌన్సిలర్ల సూచన

నల్లగొండ టూటౌన్ : ఉద్యోగులు కాంట్రాక్టర్లపై ఆధారపడకుండా బాధ్యతగా వ్యవహరించాలని పలువురు పాలకవర్గ సభ్యులు పేర్కొన్నారు. మంగళవారం మున్సిపల్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో ఇన్‌చార్జి చైర్మన్ అబ్బగోని రమేష్‌గౌడ్ అధ్యక్షతన కౌన్సిల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కాంగ్రెస్ ఫ్లోర్ లీడర్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ గతం గురించి మర్చిపోయి ఉద్యోగులంతా బాధ్యతగా పని చేయాలని, వేసవి వస్తున్నందున తాగునీటి సరఫరాపై ప్రత్యేక దృష్టి పెట్టాలని కోరారు. మున్సిపాలిటీకి 110 వాహనాల్లో రోజూ ఏదో ఒక వాహనం మరమ్మతులకు గురవుతోందని.. అవి కాంట్రాక్టర్ల కోసం వస్తున్నాయా అని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీఆర్‌ఎస్ ఫ్లోర్ లీడర్ అభిమన్యు శ్రీనివాస్ మాట్లాడుతూ వాహనాలను కాంట్రాక్టర్ మరమ్మతు చేయించడంలేదని.. ఇద్దరు మెకానిక్‌లను పెట్టి మున్సిపాలిటీనే సొంతంగా మరమ్మతు చేయించాలని అన్నారు. వీధి లైట్ల కాంట్రాక్టర్ కూడా లైట్లు వేయడం లేదని, ఇద్దరు కాంట్రాక్టర్లు ఆస్థాన కవులుగా మారారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీజేపీ ఫ్లోర్ లీడర్ బండారు ప్రసాద్ మాట్లాడుతూ గతంలో జరిగిన పొరపాట్లను సవరించడం అభినందనీయమని, మున్సిపాలిటీ తీర్మానం లేకుండా చేసిన పనులపై అవకాశం ఉంటే చర్యలు తీసుకోవాలని కోరారు. ప్లాస్టిక్, ఫ్లెక్సీలను నియంత్రించేందుకు కృషి చేయాలన్నారు. కౌన్సిలర్ ఖయ్యుంబేగ్ మాట్లాడుతూ కార్మికులందరికీ పీఎఫ్, ఈఎస్‌ఐ సౌకర్యం కల్పించాలన్నారు. మాజీ చైర్మన్ బొడ్డుపల్లి లక్ష్మి మాట్లాడుతూ సావర్కర్‌నగర్ ప్రాంతంలో తాగునీటి సరఫరాలో లోపాలు ఉన్నాయని చెప్పినా సరి చేయకుండా నిర్లక్ష్యం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇన్‌చార్జి చైర్మన్ అబ్బగోని రమేష్‌గౌడ్ మాట్లాడుతూ రూ.30 లక్షలతో చేపల మార్కెట్ నిర్మాణం చేపడుతామని, యువత చదువుకోవడానికి మొబైల్ బస్సులు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ రవి, అసిస్టెంట్ కమిషనర్ సయ్యద్ ముసాబ్ అహ్మద్, ఈఈ రాములు, ఏసీపీ నాగిరెడ్డి, పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు.

నూతన విద్యావిధానాన్ని రద్దుచేయాలి

దేవరకొండ : జాతీయ నూతన విద్యా విధానం (2020)ని రద్దు చేయాలని ఏఐఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్షుడు వలమల్ల ఆంజనేయులు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా పట్టణంలోని ఎంకేఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం సంఘం ఆధ్వర్యంలో చేపట్టిన సంతకాల సేకరణలో ఆయన పాల్గొని మాట్లాడారు. రాజ్యాంగ స్ఫూర్తికి వ్యతిరేకంగా తీసుకొచ్చిన విద్యా విధానాన్ని విద్యార్థులు, ప్రజలు తిరస్కరించాలని ఆయన కోరారు. విద్యను కాషాయికరణ చేసేందుకు కేంద్ర ప్రభుత్వం కుట్ర పన్నుతుందని ఆరోపించారు. విద్యార్థి లోకం భగత్‌సింగ్ స్ఫూర్తితో ఉద్యమించాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో శంషొద్దీన్, శివకుమార్, సైదులు, శ్రీకాంత్, జ్యోతి, స్వాతి, వీణ, కార్తీక్, తదితరులున్నారు.



మాట్లాడుతున్న ఆంజనేయులు

వారసులకు ఉద్యోగాలివ్వాలని వినతి



అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న 61 ఏళ్లు నిండిన వీఆర్‌ఏలు

నల్లగొండ : వయసు పైబడిన వీఆర్‌ఏ వారసులకు జీఓ 81 ప్రకారం ఉద్యోగ నియమకాల ఉత్తర్వులు ఇవ్వాలని కోరుతూ అదనపు కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్‌కు 61 సంవత్సరాలు నిండిన వీఆర్‌ఏలు మంగళవారం నల్లగొండలో వినతిపత్రం అందజేశారు. రెవెన్యూ శాఖలో గత 40 ఏళ్ల పైబడి విధులు నిర్వహిస్తున్నామని.. వారసులకు ఉద్యోగాలకు సంబంధించి ప్రభుత్వం ఆరు నెలల క్రితమే జీఓ 81 విడుదల చేసిందని.. ఆ జీఓ ప్రకారం ఉద్యోగాలివ్వాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సత్తయ్య, మహబూబ్ అలీ, వెంకయ్య, సుగుణమ్మ, విమలమ్మ, భిక్షమయ్య, ఇద్దయ్య, రాములు తదితరులున్నారు.

2న సాగర్ ఎస్‌ఈ కార్యాలయం ముట్టడి

మిర్యాలగూడ : నాగార్జునసాగర్ ఎడమకాల్వకు నీటిని విడుదల చేసి ఎండిపోతున్న పంటలను కాపాడాలని కోరుతూ వచ్చే నెల 2న సాగర్ ఎస్‌ఈ కార్యాలయం ముట్టడి చేపట్టినట్లు తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు జూలకంటి రంగారెడ్డి అన్నారు. మంగళవారం పట్టణంలోని సీపీఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సాగర్ ఎడమకాల్వ పరిధిలో బోర్లుబావుల కింద సాగు చేసిన వరి చేలు చేతికొచ్చే దశలో ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. సాగర్ ప్రాజెక్టులో నీటి లభ్యతను బట్టి ఎడమకాల్వకు నీటిని విడుదల చేసి చెరువులు, కుంటలను నింపి భూగర్భజలాలు పెంపొందించి పంటలను కాపాడాలని కోరారు. భవిష్యత్ అవసరాల రిత్యా ఖమ్మం జిల్లాలోని పాలేరు రిజర్వాయర్ నింపేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని, ముందుగా ఎడమకాల్వ పరిధిలోని చెరువులను నింపి రైతుల ఇబ్బందులను తొలగించాలన్నారు. రైతు సంఘం ఆధ్వర్యంలో అనేక ఆందోళనలను చేపట్టినా ప్రభుత్వం పట్టించుకోనందున వచ్చే నెల 2న నిర్వహించే సాగర్ ఎస్‌ఈ కార్యాలయం ముందు చేపట్టే ధర్నాలో ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు. సమావేశంలో సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు డబ్బీకార్ మల్లేష్, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు వీరేపల్లి వెంకటేశ్వర్లు, నాయకులు నూకల జగదీశ్చంద్ర, రాగిరెడ్డి మంగారెడ్డి, బావండ్ల పాండు, తిరుపతి రామ్మూర్తి, వినోద్‌నాయక్, సత్యనారాయణరావు, పగిడోజు రామ్మూర్తి, పాపానాయక్, సైదులు, గుణగంటి రామచంద్ర తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జూలకంటి రంగారెడ్డి

క్రమబద్ధీకరణకు విముఖత!

ఎల్‌ఆర్‌ఎస్‌కు ముందుకురాని పట్టణవాసులు

- గతంలో రూ.వెయ్యి చెల్లించిన వారికి మాత్రమే అవకాశం
- అప్పటి డాక్యుమెంట్ విలువలో 14 శాతం ఫీజు చెల్లిస్తేనే క్రమబద్ధీకరణ
- గ్రీన్ బెల్ట్, ఇండస్ట్రీస్ ఏరియాల దరఖాస్తుల తిరస్కరణ



నల్లగొండ టూటౌన్ : పట్టణాల్లో అనుమతి లేని వెంచర్లలో ప్లాట్లు కొనుగోలు చేసిన వారు తమ ప్లాట్లను క్రమబద్ధీకరణ చేసుకునేందుకు విముఖత చూపుతున్నారు. గతంలో ఆన్‌లైన్‌లో రూ.1000 చెల్లించిన వారు ప్లాట్లను క్రమబద్ధీకరణ చేసుకోవడానికి ప్రభుత్వం అవకాశం కల్పించింది. ఎప్పుడైతే ప్లాట్లు కొనుగోలు చేశారో అప్పటి రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్‌పై ఉన్న విలువలో 14 శాతం ఫీజును మున్సిపాలిటీకి చెల్లించాల్సి ఉంటుంది. అప్పట్లో వేల మంది ఎల్‌ఆర్‌ఎస్ కోసం దరఖాస్తు చేసుకున్నారు. కానీ ఇప్పుడు ఫీజు చెల్లించి ప్లాట్లను క్రమబద్ధీకరించుకోవడానికి మాత్రం ముందుకు రావడం లేదు. ప్లాట్ల యజమానులు స్వచ్ఛందంగా ఎల్‌ఆర్‌ఎస్ చేసుకోవడానికి ముందుకు రావాల్సిందే తప్ప వారిని బలవంతం చేసే అవకాశం లేదు. ఒకవేళ ప్రభుత్వం ఏదైనా నిర్ణయం తీసుకుంటే ప్లాట్ల యజమానులకు ఇబ్బందులు వచ్చే అవకాశాలు లేకపోలేదు.

ఎల్‌ఆర్‌ఎస్ చేసుకుంటేనే నిర్మాణ అనుమతి..

మున్సిపాలిటీల్లో అనుమతి లేని లేఅవుట్లలో ప్లాట్లు కొనుగోలు చేసిన యజమానులు వాటిని ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఎల్‌ఆర్‌ఎస్ చేసుకుంటేనే భవన నిర్మాణానికి మున్సిపాలిటీ నుంచి అనుమతి లభిస్తుంది. ఎల్‌ఆర్‌ఎస్ లేని ప్లాట్లలో భవనాలు నిర్మించుకోవడానికి అనుమతి ఇవ్వరు. పట్టణాల్లో వేల సంఖ్యలో ఎల్‌ఆర్‌ఎస్ లేని ప్లాట్లు ఉండడంతో గత ప్రభుత్వం ఎల్‌ఆర్‌ఎస్ చేసుకోవడానికి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరించింది. వెయ్యి రూపాయలు చెల్లించి ఆన్‌లైన్‌లో చాలా మంది దరఖాస్తులు చేసుకున్నారు. అప్పుడు దరఖాస్తు చేసుకున్న వారు 14 శాతం ఫీజు చెల్లిస్తే క్రమబద్ధీకరణ చేయనున్నారు. అప్పట్లో వెయ్యి రూపాయలు చెల్లించకుండా దరఖాస్తులు చేసుకోని వారికి క్రమబద్ధీకరణ చేయరు.

లక్షకుపైగా దరఖాస్తులు..

జిల్లాలోని నల్లగొండ, మిర్యాలగూడ, హాలియా, దేవరకొండ, చండూరు, చిట్యాల, నకిరేకల్ మున్సిపాలిటీల్లో దాదాపు లక్ష మందికిపైగా ఎల్‌ఆర్‌ఎస్ కొరకు దరఖాస్తు చేసుకున్నారు. నల్లగొండలో 36వేలు, మిర్యాలగూడలో 39 వేలు, దేవరకొండలో 14 వేలు, మిగతా చిన్న మున్సిపాలిటీల్లో 10 వేలకు పైగా దరఖాస్తులు వచ్చాయి. ఇలా జిల్లాలోని ఏడు మున్సిపాలిటీల్లో లక్ష వరకు దరఖాస్తులు రాగా కేవలం 15 వేల వరకు మాత్రమే ఫీజు చెల్లించి క్రమబద్ధీకరించుకునట్లు అధికారులు చెబుతున్నారు. ఇళ్ల నిర్మాణం చేపట్టే ఆలోచన ఉన్న వారు మాత్రమే ఎల్‌ఆర్‌ఎస్ చేసుకుంటున్నట్లు తెలుస్తోంది.

ఎల్‌ఆర్‌ఎస్ ఉంటేనే బ్యాంకు రుణం

ఇల్లు, వాణిజ్య భవనం నిర్మాణాలు చేపట్టేందుకు బ్యాంకు రుణం తీసుకోవడానికి ఎల్‌ఆర్‌ఎస్ తప్పనిసరి. ఎల్‌ఆర్‌ఎస్ లేనిదే ఏ బ్యాంకు కూడా రుణం ఇవ్వదు. చాలా ప్రాంతాల్లో పది, పదిహేనేళ్ల కిందట కొనుగోలు చేసిన ప్లాట్లకు సంబంధించి ఎక్కువగా ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులు ఉన్నాయి. ఎల్‌ఆర్‌ఎస్ క్రమబద్ధీకరణ ద్వారా ఆయా మున్సిపాలిటీలకు ఆదాయం సమకూరనుంది.

గ్రీన్‌బెల్ట్ దరఖాస్తుల తిరస్కరణ..

మున్సిపాలిటీల్లో గ్రీన్ బెల్ట్ ఏరియా, ఇండస్ట్రీస్ ఏరియాల నుంచి వందలాది మంది ప్లాట్లను క్రమబద్ధీకరణ చేసుకోవడానికి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నారు. ఆయా దరఖాస్తులను పట్టణ ప్రణాళిక విభాగం అధికారులు పరిశీలించి గ్రీన్ బెల్ట్ ఏరియా, ఇండస్ట్రీస్ ఏరియాల నుంచి వచ్చిన వాటికి అనుమతి ఇవ్వకుండా పక్కన పెడుతున్నారు.

'మంత్రి కోమటిరెడ్డి క్షమాపణ చెప్పాలి'

దేవరకొండ : హామీల అమలు గురించి ప్రశ్నించిన భువనగిరి జెడ్పీ చైర్మన్ సందీప్‌రెడ్డిపై మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి వ్యవహరించిన తీరు సరికాదని, మంత్రి కోమటిరెడ్డి వెంటనే సందీప్‌రెడ్డికి క్షమాపణలు చెప్పాలని దేవరకొండ మాజీ ఎమ్మెల్యే, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు రమావత్ రవీంద్రకుమార్ డిమాండ్ చేశారు. మంగళవారం దేవరకొండలో ఆయన విలేకరులతో మాట్లాడారు. సమావేశంలో పీఏపల్లి ఎంపీపీ వంగాల ప్రతాప్‌రెడ్డి, కంకణాల వెంకట్‌రెడ్డి, హన్మంతు వెంకటేష్‌గౌడ్, చింతపల్లి సుభాష్, బాలయ్య, వల్లపురెడ్డి, నాగార్జునరెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, తిరుపతయ్య తదితరులున్నారు.



మాట్లాడుతున్న రవీంద్రకుమార్

రంగీన్‌బామ



నల్లగొండ పట్టణంలో మంగళవారం జరిగిన రంగీన్ సినిమా షూటింగ్‌లోని ఓ సన్నివేశంలో హీరోయిన్ జాస్మిని

క్లుప్తంగా

చికిత్స పొందుతూ యువకుడు మృతి

కోదాడరూరల్: తీవ్ర గాయాలతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న యువకుడు సోమవారం రాత్రి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కోదాడ మండలంలోని దోరకుంటకు చెందిన వి. కిషోర్(19) గంజాయికి బానిస అయ్యాడు. అతడు గంజాయి సేవిస్తూ పట్టుబడిన కేసులో జైలుకు వెళ్లి ఇటీవలే బెయిల్‌పై బయటకు వచ్చాడు. నాలుగు రోజుల కిందట రాత్రి 10గంటల సమయంలో ఎవరో ఫోన్ చేస్తున్నారని ఇంట్లో చెప్పి బయటకు వచ్చిన అతడు మరుసటి రోజు తెల్లవారుజామున తన ఇంటి ముందు గాయాలతో పడి ఉన్నాడు. కుటుంబ సభ్యులు అదే రోజు కోదాడ రూరల్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసి అతడిని చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని నిమ్స్ ఆస్పత్రికి తీసుకెళ్లగా చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మృతి చెందాడు. మంగళవారం కోదాడ ప్రభుత్వ ఆస్పత్రిలో పోలీసులు మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు మృతుడు ప్రమాదవశాత్తు కిందపడి గాయపడ్డాడా లేదా ఎవరైనా కొట్టి ఇంటి ముందు పడేశారా అని గ్రామంలో చర్చించుకుంటున్నారు. పోస్టుమార్టం నివేదిక ఆధారంగా పూర్తివివరాలు తెలుస్తాయని పోలీసులు అంటున్నారు.

విద్యుదాఘాతంతో పూరి గుడిసె దగ్ధం


కాలిబూడిదైన పూరి గుడిసె

రాజాపేట: విద్యుదాఘాతంతో పూరి గుడిసె దగ్ధమైంది. ఈ ఘటన రాజాపేట మండలంలోని బసంతపురం గ్రామంలో మంగళవారం జరిగింది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. బసంతపురం గ్రామానికి చెందిన వడ్లకొండ రాజు పూరి గుడిసెలో నివాసముంటున్నాడు. మంగళవారం రాజు వృత్తిరీత్యా ట్రాక్టర్ నడపడానికి వెళ్లాడు. అతడి భార్య కూలి పని కోసం వెళ్లింది. వారు ఇంటి నుంచి వెళ్లిన గంట సమయంలోపే వారు నివసించే పూరి గుడిసె నుంచి దట్టమైన పొగలు వ్యాపించి పెద్దఎత్తున మంటలు చెలరేగాయి. ఈ ప్రమాదంలో నిత్యావసర సరుకులు, గృహోపకరణాలు, కుట్టుమిషన్, దుస్తులు కాలిబూడిదయ్యాయి. దాదాపు రూ.2లక్షల వరకు ఆస్తి నష్టం జరిగిందని బాధితులు తెలిపారు. ప్రభుత్వం ఆదుకోవాలని వేడుకున్నారు. సమాచారం అందుకున్న రెవెన్యూ అధికారులు ఘటనా స్థలానికి చేరుకుని పంచనామా నిర్వహించారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు పాశం భాస్కర్, వట్టిపల్లి శ్రీనివాస్‌గౌడ్ బాధితులను పరామర్శించి పార్టీ పరంగా ఆదుకుంటామని హామీ ఇచ్చారు.

ఎంజీయూ పార్ట్‌టైం టీచర్స్ అసోసియేషన్ కమిటీ ఎన్నిక


ఎంజీయూ వైస్ చాన్స్‌లర్ గోపాల్‌రెడ్డిని సన్మానిస్తున్న నూతన కమిటీ సభ్యులు

ఎంజీయూ (నల్లగొండ రూరల్): మహాత్మా గాంధీ యూనివర్సిటీలో పార్ట్‌టైం టీచర్స్ అసోసియేషన్ నూతన కమిటీని మంగళవారం ఎన్నుకున్నారు. అసోసియేషన్ అధ్యక్షుడిగా సత్యనారాయణరెడ్డి, జనరల్ సెక్రటరీగా సుధాకర్, వైస్ ప్రెసిడెంట్‌లుగా శ్రావ్య పూరి, ఎస్. రమేష్‌నాయక్, జాయింట్ సెక్రటరీలుగా ఇందిరాదేవి, షరీఫ్, వేణుగోపాల్‌రెడ్డి, ట్రెజరర్‌గా వీరస్వామి ఎన్నికయ్యారు. అనంతరం వైస్ చాన్స్‌లర్ గోపాల్‌రెడ్డిని నూతన కమిటీ సభ్యులు కలిసి సన్మానించారు.

హత్య కేసులో 15 మందికి జీవిత ఖైదు

- చేతబడి చేస్తున్నాడనే నెపంతో దాడి
- ఆస్పత్రిలో చికిత్సపొందుతూ మృతిచెందిన వ్యక్తి
- ఐదున్నర సంవత్సరాల క్రితం దిలావర్‌పూర్‌లో ఘటన
- నిందితులకు జీవిత ఖైదు విధిస్తూ భువనగిరి కోర్టు తీర్పు
- శిక్ష పడిన వారిలో ఇప్పటికే ఒకరు మృతి


ఖైదీలను చర్లపల్లి జైలుకు తరలిస్తున్న పోలీసులు


రోదిస్తున్న నిందితుల కుటుంబ సభ్యులు


కోర్టు ఆవరణలో నిందితుల కుటుంబ సభ్యులు, బంధువులు

మోటకొండూర్: చేతబడి చేస్తున్నాడనే నెపంతో వ్యక్తిపై దాడి చేయగా ఆ వ్యక్తి మృతి చెందాడు. ఈ కేసులో 15మందికి జీవిత ఖైదు విధిస్తూ మంగళవారం భువనగిరి జిల్లా కోర్టు తీర్పు ఇచ్చింది. శిక్ష పడిన వారిలో ఇప్పటికే ఒక వ్యక్తి మృతిచెందాడు. వివరాలు.. యాదాద్రి భువనగిరి జిల్లా మోటకొండూర్ మండలంలోని దిలావర్‌పూర్‌లో బుర్రి రాజేష్ తల్లి 2017 సంవత్సరంలో బాత్‌రూమ్‌లో పడి కాలువిరగగా కొద్ది రోజులకు చనిపోయింది. ఆమె చనిపోయిన 9నెలలకు తండ్రి అయ్యన్న ఆకస్మికంగా చనిపోయాడు. అయితే, ఇంటి పక్కనే ఉండే సీస యాదగిరి(85) చేతబడి చేశాడని, తన తల్లిదండ్రులు చనిపోవటానికి యాదగిరి కారణమని రాజేష్ భావించాడు. సీస యాదగిరి క్షుద్ర పూజలు చేస్తున్నాడని ఆరోపిస్తూ రాజేష్ బంధువులతో పాటు పలువురు గ్రామస్తులు 2018 ఆగస్టు 10న ఆయన ఇంటిపై దాడి చేశారు. దీంతో యాదగిరికి తీవ్ర గాయాలు కాగా చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని గాంధీ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ యాదగిరి 13వ తేదిన మృతి చెందిదాడు. ఈ ఘటనపై యాదగిరి పెద్ద కుమారుడు సీస గోవర్దన్ ఇచ్చిన ఫిర్యాదుతో అప్పటి ఎస్సై గండికోట మధు కేసు నమోదు చేయగా సీఐ ఆంజనేయులు దర్యాప్తు చేపట్టారు. దర్యాప్తులో భాగంగా ఏ-1గా బుర్రి రాజేష్, ఏ-2గా చొప్పరి శ్రావణ్, ఏ-3గా చొప్పరి నరేష్, ఏ-4గా చొప్పరి సత్యనారాయణ, ఏ-5గా చొప్పరి అంజమ్మ, ఏ-6గా చెక్క సత్యనారాయణ, ఏ-7గా దండు రవి, ఏ-8గా చొప్పరి శంకర్, ఏ-9గా చొప్పరి మహేందర్, ఏ-10గా చొప్పరి సందీప్, ఏ-11గా చెక్క సత్తయ్య, ఏ-12గా మానగళ్ల పుల్లయ్య, ఏ-13గా చొప్పరి రోశయ్య, ఏ-14గా కరుణాకర్, ఏ-15గా రాపాక లలితపై కేసు నమోదు చేసి న్యాయస్థానానికి పంపారు. గత ఆరు సంవత్సరాలుగా వాదోపవాదాలు విన్న న్యాయమూర్తులు స్పెషల్ పీపీ జామీల్ వినిపించిన వాదనతో ఏకీభవించిన జడ్జీ మారుతీదేవి వీరికి జీవిత ఖైదుతో పాటు ఒక్కొక్కరికి రూ.2వేల జరిమానా విధిస్తూ మంగళవారం తీర్పు ఇచ్చారు. దోషులను చర్లపల్లి జైలుకు తరలించారు. కాగా, ఫిర్యాదు దారు సీస గోవర్దన్, ఏ-14 నిందితుడు కరుణాకర్ గత సంవత్సరం అనారోగ్యంతో మరణించారు.

కోర్టు ప్రాంగణంలో బంధువుల రోదనలు

భువనగిరి క్రైం: జీవిత ఖైదు పడిన 14మందిని యాదగిరిగుట్ట సీఐ వేణుగోపాల్‌రావు, ఎస్ఐ తేజంరెడ్డి భువనగిరి కోర్టు నుంచి హైదరాబాద్‌లోని చర్లపల్లి జైలుకు తరలిస్తున్న క్రమంలో నిందితుల కుటుంబ సభ్యులు, బంధువులు కోర్టు ప్రాంగణంలో రోదించారు. జూనియర్ కళాశాల ఆవరణలో వేచిచూస్తున్న నిందితుల బంధువులు తీర్పు వెలువరించిన కోర్టు ఆవరణలోకి రోదించడం అక్కడున్న వారిని కలచివేసింది.

పురుగుల మందు తాగి యువతి ఆత్మహత్యాయత్నం

- ప్రియుడు పెళ్లికి నిరాకరించడంతో ఘాతుకం
- ఆస్పత్రికి తరలింపు

అడవిదేవులపల్లి: ప్రియుడు పెళ్లికి నిరాకరించాడని మనస్తాపానికి గురైన యువతి పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. ఈ ఘటన మంగళవారం అడవిదేవులపల్లి మండలంలోని ఉల్సాయిపాలెం గ్రామంలో జరిగింది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. అడవిదేవులపల్లి మండలం ఉల్సాయిపాలెం గ్రామానికి చెందిన పాతులోతు రాంబాబు హైదరాబాద్‌లో తన బావ రామలింగంతో కలిసి రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నాడు. మహబూబాబాద్ జిల్లా తానంచర్ల గ్రామానికి చెందిన యువతి హైదరాబాద్‌లో డిగ్రీ చదువుతోంది. వీరిద్దరికి ఆరు నెలల క్రితం సోషల్ మీడియా యాప్ ఇన్‌స్టాగ్రామ్‌లో పరిచయం ఏర్పడింది. దీంతో ప్రతిరోజు చాటింగ్ చేసుకోవడం, ఫోన్లు మాట్లాడుకునే వారు. కొన్ని నెలలకు వీరి స్నేహం ప్రేమగా మారింది. ఇటీవల సదరు యువతి పెళ్లి చేసుకోవాలని రాంబాబుపై ఒత్తిడి చేయడంతో అతడు కొద్దిరోజుల క్రితం హైదరాబాద్ నుంచి ఉల్సాయిపాలెం వచ్చి ఇంటి వద్దనే ఉంటున్నాడు. రాంబాబు వివరాలు, చిరునామా తెలుసుకున్న సదరు యువతి మంగళవారం నేరుగా ఉల్సాయిపాలెం గ్రామంలో రాంబాబు ఇంటికి వచ్చి పెళ్లి విషయంపై నిలదీసింది. రాంబాబు పెళ్లి చేసుకునేందుకు నిరాకరించడంతో మనస్తాపానికి గురైన ఆమె తన వెంట తెచ్చుకున్న పురుగుల మందు తాగింది. వెంటనే రాంబాబుతో పాటు అతడి కుటుంబ సభ్యులు, స్థానికులు చికిత్స నిమిత్తం ఆమెను అడవిదేవులపల్లి మండల కేంద్రంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం 108 వాహనంలో అక్కడి నుంచి మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రికి తరలించారు. సమాచారం తెలుసుకున్న స్థానిక పోలీసులు ఉల్సాయిపాలెం గ్రామానికి చేరకుని ఈ ఘటనకు సంబంధించిన వివరాలను సేకరించారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు దుర్మరణం

- మరొకరికి తీవ్ర గాయాలు


మధు మృతదేహం

చిట్యాల: బైక్ అదుపుతప్పి చెట్టును ఢీకొట్టిన ఘటనలో ఓ యువకుడు మృతిచెందగా.. మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటన చిట్యాల మండలంలోని పెద్దకాపర్తి గ్రామ శివారులో మంగళవారం విజయవాడ-హైదరాబాద్ జాతీయ రహదారిపై జరిగింది. చిట్యాల ఎస్ఐ డి. సైదాబాబు తెలిపిన వివరాల ప్రకారం.. ఖమ్మం జిల్లాకు చెందిన మధు (30), బద్రి బైక్‌పై ఖమ్మం నుంచి హైదరాబాద్‌కు వెళ్తున్నారు. మార్గమధ్యలో చిట్యాల మండలం పెద్దకాపర్తి గ్రామ శివారులోని సెవన్ మిడ్‌వే హోటల్ వద్దకు రాగానే బైక్ అదుపుతప్పడంతో జాతీయ రహదారి పక్కన ఉన్న చెట్టును ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో మధు అక్కడికక్కడే మృతిచెందగా.. బద్రికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మధు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం, గాయపడిన బద్రిని చికిత్స నిమిత్తం నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

పేకాట స్థావరాలపై పోలీసుల దాడులు

పాలకవీడు: మండలంలోని జాన్‌పహాడ్ దర్గా వద్ద మంగళవారం పేకాట స్థావరంపై పోలీసులు దాడి చేసి ఐదుగురిని అరెస్టు చేశారు. ఎస్ఐ లింగయ్య తెలిపిన వివరాల ప్రకారం.. నిజామాబాద్, సంగారెడ్డి జిల్లాలకు చెందిన ఐదుగురు వ్యక్తులు మంగళవారం జాన్‌పహాడ్ దర్గాను దర్శించుకునేందుకు వచ్చారు. అనంతరం విశ్రాంతి కోసమని దర్గా సమీపంలోని వక్ఫ్ బోర్డు కార్యాలయానికి వెళ్లి అక్కడ పేకాట ఆడుతుండగా.. విశ్వసనీయ సమాచారం మేరకు పోలీసులు దాడి చేసి వారిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.5,200 నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

కుతుబ్‌షాపురంలో నలుగురు..

గరిడేపల్లి: మండల పరిధిలోని కుతుబ్‌షాపురం గ్రామ శివారులో పేకాట స్థావరంపై మంగళవారం పోలీసులు దాడి చేసి నలుగురిని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్ఐ వెంకట్‌రెడ్డి తెలిపారు. మరో ఎనిమిది మంది పరారీలో ఉన్నట్లు పేర్కొన్నారు. పట్టుబడిన వారిలో కారింగుల లచ్చయ్య, షేక్ సలీం, కారింగుల చినరామయ్య, చలిగంటి అంజయ్య ఉన్నారు. వారి నుంచి మూడు సెల్‌ఫోన్‌లు, రెండు బైక్‌లు, రూ.2030 నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు. పరారీలో ఉన్న వ్యక్తులు చిత్తలూరి శివకృష్ణ, షేక్ ఉద్దండు, చిత్తలూరి రామయ్య, నీలకంటి నాగేంద్ర, నెమ్మాది సతీష్, చలిగంటి రాంబాబు, కీర్తి గోపి, మదన్‌పై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఈ దాడిలో పోలీసు సిబ్బంది నాగేశ్వరరావు, నగేష్, చాంద్‌పాషా ఉన్నారు.

చిల్లేపల్లి పీఏసీఎస్ చైర్మన్‌పై వీగిన అవిశ్వాసం

- తీర్మానం పెట్టిన డైరెక్టర్లందరూ గైర్హాజరు
- అవిశ్వాసం రద్దు చేస్తున్నట్లు ప్రకటన


సమావేశానికి హాజరైన అధికారులు

నేరేడుచర్ల: మండలంలోని చిల్లేపల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం(పీఏసీఎస్) చైర్మన్ అనంత్ శ్రీనివాస్‌గౌడ్‌పై పెట్టిన అవిశ్వాసం వీగిపోయిందని సూర్యాపేట జిల్లా కోఆపరేటివ్ అధికారి ఎం. శ్రీధర్ మంగళవారం ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చిల్లేపల్లి పీఏసీఎస్‌లో మొత్తం 13 మంది డైరెక్టర్లు ఉండగా.. అందులో ఒకరు మృతిచెందడంతో 12మంది డైరెక్టర్లుగా కొనసాగుతున్నారు. ఈ నెల 8వ తేదీన 10 మంది డైరెక్టర్లు కలిసి చైర్మన్‌పై అవిశ్వాసం పెట్టాలని కోరుతూ సూర్యాపేట జిల్లా కలెక్టర్ వెంకట్రావ్‌తో పాటు తనకు తీర్మానం కాపీలను అందజేశారని అన్నారు. ఈ మేరకు డైరెక్టర్లందరికీ ముందుగానే సమాచారం ఇచ్చి మంగళవారం ఉదయం 11:30గంటలకు చిల్లేపల్లి పీఏసీఎస్ కార్యాలయంలో చైర్మన్‌పై అవిశ్వాసం పెట్టేందుకు సమావేశం నిర్వహించినట్లు తెలిపారు. కానీ ఈ సమావేశానికి ఏ ఒక్క డైరెక్టర్ కూడా హాజరుకాకపోవడంతో అవిశ్వాసం వీగిపోయిందని అన్నారు. ఏడాది పాటు చైర్మన్‌పై అవిశ్వాసం పెట్టేందుకు వీలుండదని పేర్కొన్నారు. సమావేశంలో ఎలాంటి ఘటనలు చోటుచేసుకోకుండా నేరేడుచర్ల, పాలకవీడు ఎస్ఐలు పచ్చిపాల పరమేష్, లింగయ్య ఆధ్వర్యంలో పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో అసిస్టెంట్ రిజిస్ట్రార్ కె. పద్మజ, బి. రాజశ్రీ పాల్గొన్నారు.

మంత్రి కోమటిరెడ్డికి అహంకారం పనికిరాదు

- రాజ్యసభ సభ్యుడు బడుగుల లింగయ్యయాదవ్


మాట్లాడుతున్న బడుగుల లింగయ్యయాదవ్

సూర్యాపేట: మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అహంకారంతో వ్యవహరించడం మానుకోవాలని రాజ్యసభ సభ్యుడు బడుగుల లింగయ్యయాదవ్ అన్నారు. మంగళవారం సూర్యాపేట పట్టణంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ కార్యక్రమంలో వీధి రౌడీలా మంత్రి ప్రవర్తించారని అన్నారు. ఇలాంటి దుర్మార్గపు చర్య ఇప్పటి వరకు ఏ మంత్రి చేయలేదన్నారు. కాంగ్రెస్ పార్టీ గ్యారంటీల అమలును ప్రశ్నించినందుకే భువనగిరి జెడ్పీ చైర్మన్ ఎలిమినేటి సందీప్‌రెడ్డిపై దాడికి పాల్పడ్డారని ఆరోపించారు. కేబినెట్ హోదా కలిగిన వ్యక్తిపై పోలీసులను అడ్డుపెట్టుకొని మంత్రి అరాచకం చేశారన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి 50రోజులు కాకముందే దాడులకు దిగుతున్నారని అన్నారు. సందీప్‌రెడ్డికి మంత్రి కోమటిరెడ్డి బేషరతుగా క్షమాపణ చెప్పాలన్నారు. కార్యక్రమంలో జెడ్పీ చైర్మన్ గుజ్జ దీపికాయుగేంధర్‌రావు, వై. వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

అక్రమంగా మట్టి తరలించిన వ్యక్తిపై కేసు

పెద్దఅడిశర్లపల్లి: మండలంలోని గట్‌నెమళిపురం గుట్ట ప్రాంతంలో అక్రమంగా మట్టి తరలించిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు నల్లగొండ డిప్యూటీ ఫారెస్ట్ రేంజ్ అధికారి వి. శేఖర్‌రెడ్డి తెలిపారు. పెద్దఅడిశర్లపల్లి మండల పరిధిలోని గట్‌నెమళిపురం గుట్ట ప్రాంతంలో పెద్దవూర మండలం పినవూర గ్రామానికి చెందిన రైతు సతీష్‌రెడ్డి అక్రమంగా మట్టిని తవ్వి తన పొలంలోకి తరలించడంతో అతనిపై కేసు నమోదు చేసి నిడమనూరు కోర్టులో హాజరుపర్చినట్లు తెలిపారు.

54 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం పట్టివేత

నాగారం: మండల పరిధిలోని మాచిరెడ్డిపల్లి, ఈటూరు గ్రామాల్లో అక్రమంగా నిల్వ చేసిన 54 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని పట్టుకొని సీజ్ చేసినట్లు ఏఎస్ఐ వెంకట్రాములు తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. స్పెషల్ బ్రాంచ్ పోలీసుల సమాచారం మేరకు మాచిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన వడ్డే లక్ష్మయ్య ఇంట్లో అక్రమంగా నిల్వ చేసిన 20 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని, ఈటూర్ గ్రామానికి చెందిన గుండు యాదగిరి ఇంట్లో నిల్వ చేసిన 34 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని పట్టుకున్నట్లు తెలిపారు. పట్టుబడిన బియ్యాన్ని సీజ్ చేసి కేసులు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

ఆరుగురిని బలిగొన్న లారీ స్వాధీనం


లారీని పరిశీలిస్తున్న డీఎస్పీ వెంకటగిరి, సీఐ నరసింహారావు

మిర్యాలగూడ అర్బన్: మిర్యాలగూడ పట్టణంలోని నార్కట్‌పల్లి-అద్దంకి బైపాస్ రోడ్డులో ఆదివారం రాత్రి కారును ఢీకొట్టి ఆరుగురిని బలిగొన్న లారీని మిర్యాలగూడ టూటౌన్ పోలీసులు ఆంధ్రప్రదేశ్‌లోని అద్దంకి వద్ద పట్టుకుని మంగళవారం పోలీస్ స్టేషన్‌కు తరలించారు. లారీ ముందుభాగం కారును ఢీకొట్టడంతో లారీ కూడా కొంతమేర ధ్వంసమైంది. మంగళవారం లారీని డీఎస్పీ పి. వెంకటగిరి పరిశీలించారు. ప్రమాదం జరిగిన వెంటనే డ్రైవర్ లారీని ఆపకుండా వెళ్లిపోగా.. సీసీ కెమెరాల సహాయంతో టూటౌన్ ఎస్ఐ క్రిష్ణయ్య బృందం అద్దంకి వద్ద లారీని పట్టుకుని డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నట్లు డీఎస్పీ తెలిపారు.

యువతిపై లైంగిక దాడికి యత్నం

- అవమానంతో ఆత్మహత్య
- సెలూన్ యజమానిని అదుపులోకి తీసుకున్న పోలీసులు


దివ్య (ఫైల్)


నిందితుడు మురళి

మీర్‌పేట: ఓ సెలూన్ యజమాని లైంగిక దాడికి యత్నించడంతో మనస్తాపం చెందిన యువతి సెలూన్‌లోనే ఆత్మహత్యకు యత్నించి చికిత్స పొందుతూ మృతి చెందింది. ఈ సంఘటన రంగారెడ్డి జిల్లా మీర్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం.. నల్లగొండ జిల్లా చింతపల్లి మండలం తక్కలపల్లి గ్రామానికి చెందిన సువర్ణకు ముగ్గురు కుమార్తెలు. వీరు ప్రస్తుతం సంతోష్‌నగర్‌లో నివాసముంటున్నారు. రెండవ కుమార్తె దివ్య (18) ఆరు నెలలుగా మీర్‌పేట టీచర్స్‌కాలనీ చౌరస్తాలో 'ది బాబ్ ఫ్యామిలీ సెలూన్'లో పనిచేస్తూ అక్కడే ఉంటోంది. యువతిపై కన్నేసిన సెలూన్ యజమాని మురళి(35) సోమవారం మధ్యాహ్నం 3 గంటల ప్రాంతంలో సెలూన్‌లోని గదిలోకి తీసుకెళ్లి లైంగిక దాడికి యత్నించగా తిరస్కరించింది. అనంతరం అవమానం తట్టుకోలేక దివ్య శానిటైజర్ తాగింది. విషయం తెలుసుకున్న తల్లి, కుటుంబ సభ్యులు వెంటనే దివ్యను ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లి ప్రాథమిక చికిత్స అందించి ఇంటికి తీసుకెళ్లారు. కాగా, మంగళవారం ఉదయం దివ్య ఆరోగ్యం క్షీణించడంతో కుటుంబ సభ్యులు కర్మన్‌ఘాట్‌లోని గ్లోబల్ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలోనే మృతి చెందింది. దీంతో కుటుంబ సభ్యులు, బంధువులు దివ్య మృతదేహంతో సెలూన్ వద్దకు చేరుకుని ఆందోళన చేపట్టారు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని సముదాయించి పంపించారు. నిందితుడిని అదుపులోకి తీసుకున్నామని, మృతురాలి కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారిస్తున్నామని సీఐ కాశీవిశ్వనాథ్ తెలిపారు.

బెల్లి యాదయ్యకు ధర్మనిధి పురస్కారం


అవార్డు అందుకుంటున్న బెల్లి యాదయ్య

నకిరేకల్, రామన్నపేట: నకిరేకల్ మండలంలోని పాలెం గ్రామ పంచాయతీకి చెందిన ప్రసిద్ధ కవి, గాయకుడు డాక్టర్ బెల్లి యాదయ్యకు తెలంగాణ సారస్వత పరిషత్ వారి ప్రతిష్టాత్మక డాక్టర్ బెజవాడ గోపాల్‌రెడ్డి ధర్మనిధి సాహిత్య పురస్కారం దక్కింది. సాహిత్య, సాంస్కృతిక రంగంలో గత ముప్పై ఏళ్లుగా యాదయ్య చేసిన కృషికి గాను ఈ పురస్కారం లభించింది. బెల్లి యాదయ్య ప్రస్తుతం రామన్నపేటలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అసోసియేట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నారు. ఈ అవార్డును మంగళవారం హైదరాబాద్‌లో తెలంగాణ సారస్వత పరిషత్ అధ్యక్షుడు ఆచార్య ఎల్లూరి శివారెడ్డి చేతుల మీదుగా ఆయన అందుకున్నారు. బెల్లి యాదయ్యను స్థానిక ఎమ్మెల్యే వేముల వీరేశం, ప్రపంచ ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య జనరల్ సెక్రటరీ ఎంవీ గోనారెడ్డి, వివిధ కళాశాలల ప్రధానాచార్యులు డాక్టర్ రాహత్ ఖానం, డాక్టర్ ఉపేందర్, డాక్టర్ ఘనశ్యాం, డిగ్రీ లెక్చరర్ల సంఘం రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ రాజారాం, కత్తుల గిరిబాబు తదితరులు అభినందించారు.

బస్సు ఢీకొని భక్తురాలు మృతి

- చెర్వుగట్టులోని పార్వతమ్మ ఆలయం ఆవరణలో ఘటన

నార్కట్‌పల్లి: మండలంలోని చెర్వుగట్టు గ్రామంలోని పార్వతమ్మ ఆలయంలో నిద్ర చేయడానికి వచ్చిన భక్తురాలు ట్రావెల్స్ బస్సు ఢీకొనడంతో మృతిచెందింది. ఈ ఘటన సోమవారం రాత్రి జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కనగల్ మండలం పగిడిమర్రి గ్రామానికి చెందిన ఇటికాల కళమ్మ(37) చెర్వుగట్టు పార్వతీ జడల రామలింగేశ్వరస్వామి దర్శనానికి సోమవారం వచ్చింది. రాత్రి గట్టు కింద పార్వతమ్మ ఆలయ ఆవరణలో ఆమె నిద్రిస్తుండగా ట్రావెల్ బస్సును డ్రైవర్ నిర్లక్ష్యంగా నడపడంతో ఆమె మీద నుంచి బస్సు వెళ్లి తల పగిలి అక్కడికక్కడే మృతిచెందింది. మంగళవారం మృతురాలి భర్త ఇటికాల శ్రీను ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ నర్ర అంతిరెడ్డి తెలిపారు.

రాష్ట్రస్థాయి గణితశాస్త్ర పోటీ పరీక్షకు ఎంపిక


రాత్లావత్ రాము

డిండి: నల్లగొండ జిల్లా గణిత ఫోరం ఆధ్వర్యంలో మంగళవారం ఆన్‌లైన్‌లో నిర్వహించిన గణిత శాస్త్ర పోటీ పరీక్షలో డిండి మండలంలోని చెర్కుపల్లి జెడ్పీహెచ్ఎస్ విద్యార్థి రాత్లావత్ రాము జిల్లాస్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచినట్లు ప్రధానోపాధ్యాయుడు రాంరెడ్డి తెలిపారు. నిజామాబాద్ జిల్లాలోని తెలంగాణ యూనివర్సిటీలో బుధవారం జరిగే రాష్ట్రస్థాయి గణితశాస్త్ర పోటీ పరీక్షకు ఎంపికైనట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా రామును పాఠశాల ఉపాధ్యాయులు తిరుపతయ్య, జయరాజు, సృజన, రమాదేవి, వేణు, ప్రభావతి, ధనమ్మ, లెనిన్, శోభన్‌బాబు అభినందించారు.

నల్లగొండలో 'రంగీన్' షూటింగ్


చేజింగ్ సీన్‌లో పరిగెడుతున్న హీరోయిన్


హీరో, హీరోయిన్‌కు సీన్ గురించి చెబుతున్న దర్శకుడు

దుర్గాదేవి ప్రొడక్షన్స్‌పై తెలుగు, హిందీ, తమిళ భాషల్లో గంజి రమేష్‌కుమార్ నిర్మిస్తున్న రంగీన్ సినిమా షూటింగ్‌ను మంగళవారం నల్లగొండ మున్సిపాలిటీ పరిధి పాతబస్తీలోని అక్కచెల్మ ప్రాంతం, ఐటీ హబ్, పానగల్ ఛాయా సోమేశ్వర ఆలయం, రాక్‌హిల్స్ కాలనీ, ఐకాన్ ఆస్పత్రిలో చేశారు. ఈ చిత్రంలో హీరో ఆకాష్, హీరోయిన్ జాస్మిని, డాక్టర్‌గా మిర్యాల స్వామితో పాటు నల్లగొండ కళాకారులు నటించారు.

– సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, నల్లగొండ

ట్రాన్స్‌ఫార్మర్ దొంగల అరెస్ట్

- రూ.3లక్షల విలువైన 305 కిలోల కాపర్ వైరు స్వాధీనం
- వివరాలు వెల్లడించిన డీఎస్పీ పి. వెంకటగిరి


నిందితులను చూపుతున్న డీఎస్పీ పి. వెంకటగిరి, పోలీసు సిబ్బంది

మిర్యాలగూడ అర్బన్: చెడు వ్యసనాలకు బానిసై సులభంగా డబ్బులు సంపాదించాలని ట్రాన్స్‌ఫార్మర్లలోని కాపర వైరును చోరీ చేస్తున్న ముఠాను మిర్యాలగూడ పోలీసులు మంగళవారం అరెస్ట్ చేశారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను మంగళవారం మిర్యాలగూడ డీఎస్పీ పి. వెంకటగిరి విలేకరులకు తెలియజేశారు. డీఎస్పీ తెలిపిన వివరాల ప్రకారం.. నిడమనూరు మండలం ముప్పారం గ్రామానికి చెందిన కుంచం కోటేష్, రూపాని గోపి, రూపాని నాగయ్య, వరికుప్పల శ్రీను, ఒరుసు నాగరాజు, కుంచం విజయ్ చెడు వ్యసనాలకు బానిసై సులభంగా డబ్బు సంపాదించాలని ముఠాగా ఏర్పడ్డారు.

యూట్యూబ్ లో చూసి నేర్చుకుని..

ఈ ఆరుగురు యూట్యూబ్‌లో చూసి ట్రాన్స్‌ఫార్మర్లలో కాపర్ వైరు ఏవిధంగా తీయాలి, ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏవిధంగా పగులగొట్టాలని నేర్చుకున్నారు. రాత్రి సమయంలో బైక్‌లపై తిరుగుతూ ఊరికి దూరంగా, నిర్మానుష్య ప్రాంతాల్లో ఉన్న ట్రాన్స్‌ఫార్లను గుర్తించి వాటిని పగులగొట్టి అందులోని కాపర్ వైర్లను చోరీ చేసేవారు. ఈ విధంగా మిర్యాలగూడలో 2, వేములపల్లిలో 2, నేలకొండపల్లిలో 1, త్రిపురారంలో 2 మొత్తం ఏడు ట్రాన్స్‌ఫార్మర్లలో కాపర్ వైరును చోరీ చేశారు. అలా చోరీ చేసిన కాపర వైర్లను ఓ గడ్డివాములో దాచిపెట్టి అవసరం ఉన్నప్పుడుల్లా కొంత అమ్ముకునేవారు. మంగళవారం చోరీ చేసిన కాపర వైర్లలో కొంత భాగాన్ని బస్తాల్లో పెట్టి పాత ఇనుము షాపులో అమ్మాలని నిర్ణయించుకుని మూడు బైక్‌లపై ఆరుగురు వెళ్తుండగా.. మిర్యాలగూడ టౌణంలోని ఫ్లైఓవర్ వద్ద వాహనాలు తనిఖీలు చేస్తున్న టూటౌన్ పోలీసులను చూసి వారు పారిపోయేందుకు ప్రయత్నించారు. పోలీసులు వారిని వెంబడించి అదుపులోకి తీసుకుని విచారించగా ట్రాన్స్‌ఫార్మర్లలో కాపర వైరు చోరీ చేస్తున్న విషయం వెలుగులోకి వచ్చింది. నిందితుల నుంచి రూ.3లక్షల విలువ చేసే 305 కేజీల కాపర్ వైరుతో పాటు మూడు బైక్‌లు, మూడు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు డీఎస్పీ పేర్కొన్నారు. ఈ కేసును ఛేదించిన సీఐ ఏ. నరసింహారావు, ఎస్ఐలు ఎస్. క్రిష్టయ్య, బి. రాంబాబు, డి. విజయ్‌కుమార్, వీరశేఖర్, హెడ్‌కానిస్టేబుల్ పి. వెంకటేశ్వర్లు, కానిస్టేబుళ్లు రవి, నరేష్, అక్బర్, రామకృష్ణను డీఎస్పీ అభినందించారు.

సాక్షి క్లాసిఫైడ్స్

Automobiles

VEHICLE FOR SALE
2022 Model HCV-TATA LPT 4825 Reg No. TS 05-UE-8838 is Ready for Sale in as Where is in Condition Contact: Sundaram Finance Ltd. Nalgonda. Cell: 9440909834, 8331998431 [Y-798416]

Wanted
మీ ఇంటి వద్దనే వుండి మీ మొబైల్ ద్వారా మా కంపెనీ యొక్క Message పంపుతూ వారానికి 3500/- సంపాదించుకోండి. వాట్సాప్ చేయండి. సంప్ర. 9573633520, 9059633520. [M-1167512]

ప్రముఖ కంపెనీలో పార్ట్ టైం మాన్యువల్ రైటింగ్ వర్క్ చేయుటకు స్త్రీ/పురుషులు కావలెను. వీక్లీ పేమెంట్. మీ పేరు, అడ్రస్ కాల్/వాట్సాప్ చేయగలరు. 91777 36926. [M-1233768]

శ్రీ విఘ్నేశ్వర హోండా షోరూం నల్లగొండ నందు సేల్స్ ఎగ్జిక్యూటివ్ (Male), సర్వీస్ సూపర్ వైజర్స్, కంప్యూటర్ ఆపరేటర్, స్పేర్‌పార్ట్స్ ఎగ్జిక్యూటివ్ (Female) మరియు నార్కట్‌పల్లి, మాల్ నందు సేల్స్ ఎగ్జిక్యూటివ్, మెకానిక్ కావలెను. సంప్ర॥ 9290053788, 9290143623 [YA-15217]

ప్రకటన కొరకు కాల్ చేయండి!! సాక్షి క్లాసిఫైడ్స్
ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకు
నాలుగు లైన్లకు రూ.:220/- (Black & White)
అదనపు లైనుకు రూ.: 50/- మాత్రమే
5% GST అదనం
వివరాలకు
నల్లగొండ: 9912220737, 9010080143, 9010002038
మిర్యాలగూడ: 9666021744
నకిరేకల్: 9010178203
సూర్యాపేట: 9912220740, 9010038110
కోదాడ: 9010046033
భువనగిరి: 9010073592

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించి చదివి ప్రతి స్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటన దారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.